


# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

సోమవారం, ఫిబ్రవరి 3, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

## 15 లోపు 'పంచాయతీ' షెడ్యూల్!

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి



## బడ్జెట్‌లో కేంద్రం వివక్షపై యుద్ధం



- అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ప్రకటిస్తున్నాం
- కాంగ్రెస్ ధర్నాలో పార్టీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- 8 మంది చొప్పున బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డే
- బీజేపీ ఎంపీలకు తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఇప్పటికైనా గొంతెత్తాలి..
- కిషన్‌రెడ్డి, సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్
- నేడు జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపు




## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్

- రాష్ట్రంలో మొత్తం జనాభా సుమారు 3.7 కోట్లు.. సర్వేలో పాల్గొన్నది 3.54 కోట్లు
- గుర్తించిన కుటుంబాలు 1,15,17,457...
- సర్వే చేసినవి 1,12,15,134 కుటుంబాలు
- 3 లక్షలకుపైగా కుటుంబాలకు చెందిన 16 లక్షల మంది సర్వేకు దూరం
- తాళం వేసి ఉన్న ఇళ్లు 1.03 లక్షలు.. వివరాలు ఇవ్వడానికి నిరాకరించినవారు 1.68 లక్షలు
- మిగతా వారంతా వలస కార్మికులుగా గుర్తింపు

హైదరాబాద్: తెలంగాణ సామాజిక ముఖ చిత్రం విడుదలైంది. రాష్ట్రంలో సామాజిక వర్గాల వారీగా జనాభా లెక్క తేలింది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లలో రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)' గణాంకాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. సర్వే వివరాలను, సర్వే జరిగిన తీరును వివరించారు. రాష్ట్రంలో సుమారు 3.7 కోట్ల మంది జనాభా ఉండగా.. అందులో 3.54 కోట్ల మందికి సంబంధించి సర్వే జరిగింది. వివిధ కారణాలతో మరో 16 లక్షల మంది (3.1%)కి సంబంధించిన వివరాల సేకరణ జరగలేదు. సర్వే చేసిన జనాభాకు సంబంధించి పురుషులు 1.79 కోట్లు, మహిళలు 1.75 కోట్లు, థర్డ్ జెండర్ 13,774 మంది ఉన్నారు. ఈ సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో అత్యధికంగా 46.25 శాతం మంది బీసీలు ఉన్నారు. తర్వాత షెడ్యూల్డ్ కులాల జనాభా 17.43 శాతం, ఓసీలు 13.31 శాతం,

(మిగతా 2వ పేజీలో)




## న్యాక్ రేటింగ్ కోసం లంచాలు

### గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీ, న్యాక్ అధికారుల అరెస్ట్

- కేఎల్‌యూతో న్యాక్ పర్యవేక్షక బృందం సభ్యుల కుమ్మక్కు
- పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్న అధికారులు
- విజయవాడ, చెన్నై సహా దేశవ్యాప్తంగా 20 చోట్ల సీబీఐ సోదాలు
- పెద్ద ఎత్తున నగదు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, బంగారం స్వాధీనం
- కేఎల్ఈఎఫ్‌కు చెందిన 14 మందిపై ఎఫ్ఐఆర్

న్యాక్ రేటింగ్ కోసం అక్రమాలకు పాల్పడిన కేఎల్ యూనివర్సిటీ అధికారులతోపాటు న్యాక్ పర్యవేక్షక బృందం సభ్యులను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్ఈఎఫ్)కు చెందిన అధికారులతోపాటు న్యాక్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యులతో కలిపి మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకున్నట్టు దర్యాప్తు సంస్థ తెలిపింది. న్యాక్ అక్రెడిటేషన్ 'ఎ++' కోసం కేఎల్‌యూ అధికారుల నుంచి న్యాక్ సభ్యులు ముడుపులు తీసుకున్న కేసులో వీరు అరెస్ట్ అయ్యారు. కేఎల్ఈఎఫ్ ఆఫీస్ బేరర్లతోపాటు న్యాక్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యులపై కేసు నమోదు చేసిన సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ ఘటన తర్వాత చెన్నై, బెంగళూరు, విజయవాడ, పాలము, సంబల్‌పూర్, భోపాల్, బిలాస్‌పూర్, గౌతంబుద్ధ నగర్, న్యూఢిల్లీ సహా మొత్తం 20 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా అక్రెడిటేషన్ కోసం అధికారులకు ముట్టజెప్పినట్టుగా చెబుతున్న నగదు, బంగారం, ల్యాప్‌టాప్‌లు,

(మిగతా 2వ పేజీలో)

## మేం వాళ్లకే భయపడలేదు... ఈ పెద్దిరెడ్డి ఎంత!: నాగబాబు

- పుంగనూరు నియోజకవర్గంలో జనసేన సభ
- సోమల గ్రామంలో జనంలోకి జనసేన సభ
- హాజరైన నాగబాబు
- పెద్దిరెడ్డి కాదు... ఇంకే రెడ్డి వచ్చినా భయపడేది లేదంటూ వ్యాఖ్యలు



చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని సోమల గ్రామంలో ఏర్పాటు చేసిన 'జనంలోకి జనసేన' భారీ బహిరంగ సభకు పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు హాజరయ్యారు. ఈ సభలో ఆయన ప్రసంగించారు. ఇక్కడ అందరూ పెద్దిరెడ్డికి భయపడతారు... మీరు కూడా జాగ్రత్త అని కొందరు చెప్పారని నాగబాబు వెల్లడించారు. అయితే... పెద్దిరెడ్డి కాదు... ఇంకే రెడ్డి వచ్చినా తాము భయపడబోమని చెప్పానని తెలిపారు. "పెద్దిరెడ్డికే కాదు... వాళ్ల నాయకుడు జగన్ కు, జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డికే భయపడలేదు... ఇతనెంత! మేం న్యాయంగా, ధర్మంగా ముందుకెళ్లే పవన్ కల్యాణ్ నాయకత్వంలో పనిచేస్తున్నాం... మాకు పెద్దిరెడ్డి కాదు కదా... సుబ్బారెడ్డి, మరో పిచ్చిరెడ్డి వచ్చినా భయపడేది లేదు" అని నాగబాబు స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి భూ దోపిడీకి పాల్పడ్డాడని, తను దోచుకున్న భూముల రికార్డులు లేకుండా మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం చేయించాడని ఆరోపించారు. తగలబడిన ఫైళ్లలో చాలావరకు 22ఏ కింద ఉన్న ప్రభుత్వ భూములకు

(మిగతా 2వ పేజీలో)



ఇండియా-ఇండోనేసియాది

## తరాల బంధం: మోదీ



## కేజ్రీ యమునా జలం తాగాలి: రాహుల్

## ఫిబ్రవరి 5న ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు

ప్రజల కోసం పాటుపడే వాళ్లు కావాలి... అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలి... కమలం గుర్తుకు ఓటేయాలి... ఇక్కడ పోటీ చేస్తున్న సంజయ్ గోయల్ ను గెలిపించాలి... 1995లో హైదరాబాద్ ఎలా ఉందో ప్రస్తుతం ఢిల్లీ అలా ఉంది. ఇక్కడ గాలి కాలుష్యమే కాదు రాజకీయ కాలుష్యం కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో మా కూటమిని నమ్మి ప్రజలు ఓట్లేశారు... వైసీపీని ఇంటికి పంపించారు... డబుల్ ఇంజిన్ సర్కారుకే ప్రజలు ఓట్లేశారు... ఆరు నెలల్లోనే లక్షల కోట్ల అభివృద్ధికి బాటలు వేశాం... ఇక్కడ ఢిల్లీలో ఆప్ ఇంజిన్ సర్కారు కావాలా, మీకు డబుల్ ఇంజిన్ సర్కారు కావాలా?" అని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## న్యాక్ రేటింగ్ కోసం లంచాలు

మొబైల్ ఫోన్లు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో దాదాపు రూ. 37 లక్షల నగదు, 6 లెనోవో ల్యాప్‌టాప్‌లు, ఒక ఐఫోన్ 16 ప్రో మొబైల్ ఫోన్, ఒక బంగారు నాణెం, అమెరికన్ టూరిస్టర్ ట్రాలీ బ్యాగులు ఉన్నాయి. ఇక, అరెస్ట్ అయిన వారిలో కేఎల్ఈఎఫ్ వైస్ చాన్స్‌లర్ జీపీ సారథి వర్మ, వైస్ ప్రెసిడెంట్ కోనేరు రాజా హరీన్, కేఎల్‌యూ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ ఉన్నారు. వీరితోపాటు ఆరుగురు న్యాక్ పర్యవేక్షణ బృందం సభ్యులు కూడా ఉన్నారు. అలాగే, న్యాక్ సీనియర్ అధికారులు, కేఎల్ఈఎఫ్‌కు చెందిన 14 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దర్యాప్తు కొనసాగుతోందని, దాడుల అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని సీబీఐ అధికారులు తెలిపారు. తాజా, ఘటన నేపథ్యంలో న్యాక్ అక్రెడిటేషన్ ప్రక్రియపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

### ఇండియా-ఇండోనేసియాది తరాల బంధం: మోదీ

న్యూఢిల్లీ: భారత్, ఇండోనేసియాల మధ్యనున్నది కేవలం భౌగోళికరాజకీయం సంబంధం కాదని ప్రధాని మోదీ చెప్పారు. రెండు దేశాలది వేల ఏళ్లుగా పెనవేసుకుపోయిన బంధమని చెప్పారు. రెండు దేశాల భిన్నత్వంలో ఏకత్వమనే సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. ఇండోనేసియా రాజధాని జకార్తాలో సనాతన ధర్మ ఆలయంలో ఆదివారం జరిగిన మహా కుంభాభిషేకం సందర్భంగా వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రసంగించారు. జకార్తాలోని మురుగన్ ఆలయంలో అభిషేక ఉత్సవాల్లో పాలుపంచుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రజలు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్కంధ షష్ఠి కవచం ప్రజలను అన్ని వేళలా కాపాడాలని ఆకాంక్షించారు. మురుగన్ ఆలయంలో తిరుప్పుగల్ శ్లోకాలతో పూజలు కొనసాగాలన్నారు. 'మనమంతా మురుగన్, శ్రీరాముడు, బుద్ధుని సంబ్యాదీకులమని చెప్పారు.

### కేజ్రీ యమునా జలం తాగాలి: రాహుల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రజలకు సరఫరా చేసే దుర్గంధపూరిత నీరు తాగాలని ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌కు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రధాని మోదీ మాదిరిగానే కేజ్రీవాల్ కూడా తప్పుడు హామీలతో ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. హౌజ్ కాజీ చౌక్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. 2020 అల్లర్ల బాధితులను తరఫున తనతోపాటు తన పార్టీ మాత్రమే మద్దతుగా నిలిచిందని, అణచివేతకు గురయ్యే వారికి ఇకపైనా దన్నుగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రేమ, సోదరభావాన్ని పంచే కాంగ్రెస్ కావాలో విద్వేషాన్ని, హింసను ప్రేరేపించే బీజేపీ కావాలో తేల్చుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

## 15 లోపు 'పంచాయతీ' షెడ్యూల్!

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి



వైరా: ఈనెల 15వ తేదీలోగా గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ వస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆదివారం ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడకలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాము పండించిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలో0త్ రాందాస్ నాయక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సర్వే ఇది

**మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం, దామోదర, సీతక్క వెల్లడి**

**96.9 శాతం కచ్చితత్వంతో.. 50 రోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించాం**

**4న కేబినెట్‌కు సర్వే నివేదిక అందజేత**

**మంగళవారం ఉదయం 10 గంటలకు మంత్రివర్గం భేటీ అయి చర్చిస్తుంది**

**అదేరోజుఅసెంబ్లీలో నివేదిక అని వెల్లడి**



హైదరాబాద్: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ పూర్తయిందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4న ఈ సర్వే నివేదికను రాష్ట్ర కేబినెట్‌కు అందిస్తామని, ఆ రోజున ఉదయం 10 గంటలకు కేబినెట్ భేటీ అయి నివేదికపై చర్చిస్తుందని వెల్లడించారు. అదే రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే అసెంబ్లీలో నివేదికపై చర్చిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే'పై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌తోపాటు కో%-%చైర్మన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు ఆదివారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

**దేశంలో ఎక్కడా లేనంత కచ్చితంగా..**

రాష్ట్ర ప్రభుత్వం యాభై రోజుల్లోనే 96.9 శాతం కచ్చితత్వంతో సమగ్ర సర్వే నిర్వహించి రికార్డు సృష్టించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎక్కడా ఇంతటి కచ్చితత్వంతో సర్వే జరగలేదన్నారు. 2023 అసెంబ్లీ ఎన్ని కల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చి న హామీ మేరకు ఈ సర్వే చేపట్టామని తెలిపారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేకు సంబంధించి ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి తదితరులు ఆదివారం మంత్రివర్గ ఉపసంఘానికి సర్వే నివేదిక సమర్పించారని వెల్లడించారు.

**సంక్షేమ కార్యక్రమాల కోసం**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సర్వే వివరాలను వినియోగించుకుంటామని తెలిపారు. ఇది కేవలం డేటా సేకరణ ప్రక్రియ మాత్రమే కాదని, సామాజిక న్యాయ విప్లవమని వ్యాఖ్యానించారు. సర్వేపై తప్పుడు ప్రచారాలు, హైకోర్టులో పిల్‌లు వేయడం వంటి సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వడంతో సర్వే సమగ్రంగా కొనసాగిందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేలా అధికార యంత్రాంగం వివిధ కార్యక్రమాలు నిర్వహించి.. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పారు. సర్వేలో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బందికి మంత్రివర్గ ఉపసంఘం అభినందనలు తెలుపుతోందన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్

ముస్లిం మైనార్టీలు 12.56 శాతం, షెడ్యూల్డ్ తెగలవారు 10.45 శాతం ఉన్నారు. ముస్లిం మైనార్టీలలో 2.48శాతం ఓసీ కేటగిరీకి చెందినవారు. వీరిని కూడా కలిపితే రాష్ట్రంలో ఓసీ కేటగిరీ జనాభా 15.79% అవుతోంది.

**యాభై రోజుల్లో 'సమగ్రం'గా..**

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చేందుకు.. సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు వీలుగా సర్వే చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసింది. గతేడాది అక్టోబర్ 10న రాష్ట్రంలో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)' చేపడుతున్నట్టుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 6నలో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. తొలి మూడు రోజుల పాటు ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసిన సర్వే సిబ్బంది.. తొమ్మిదో తేదీ నుంచి వివరాల సేకరణ ప్రారంభించారు. నవంబర్ 31 నాటికే పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నా.. కొన్నిచోట్ల వివరాల సేకరణ సుదీర్ఘంగా కొనసాగడం, ఇంటి యజమానులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో జాప్యం జరిగింది. డిసెంబర్ మూడో వారం నాటికి సర్వే ప్రక్రియ, డేటా ఎంట్రీ పూర్తయింది.

**16 లక్షల మంది దూరం..**

రాష్ట్రవ్యాప్తంగా 1,15,17,457 కుటుంబాలు ఉన్నట్టు గుర్తించిన అధికారులు.. అందులో 1,12,15,134 కుటుంబాల వివరాలను సేకరించారు. సుమారు మూడు లక్షల కుటుంబాలకు సంబంధించిన సమాచారం సేకరించలేదు. ఇందులో 1.03 లక్షల ఇళ్లు తాళం వేసి ఉండగా.. 1.68 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనేందుకు ముందుకు రాలేదు. మిగతా కుటుంబాలు రాష్ట్రేతర వలస కార్మికులు కావడంతో సర్వే చేయలేదు. మొత్తంగా సుమారు 16 లక్షల మందికి సంబంధించిన వివరాల సేకరణ జరగలేదని అంచనా. 96.9 శాతం కచ్చితత్వంతో సర్వే జరిగిందని అధికారులు చెప్తున్నారు. ఈ సర్వేలో 94,863 మంది ఎన్యుమరేటర్లు, 9,628 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. సుమారు 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో 36 రోజుల్లో సర్వే వివరాలను డిజిటలైజ్ చేశారు.

## మేం వాళ్లకే భయపడలేదు... ఈ పెద్దిరెడ్డి ఎంత!: నాగబాబు

సంబంధించిన పత్రాలేనని సీఐడీ అధికారులు నిర్ధారించారని వివరించారు. కూటమి ప్రభుత్వంలో, తప్పు చేసిన వాళ్లెవరూ తప్పించుకోలేరని నాగబాబు హెచ్చరించారు. శాసనసభ చుట్టుపక్కలకు రావడానికి కూడా వైసీపీ నేతలకు ధైర్యం సరిపోవడంలేదని నాగబాబు ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వడంలేదని వైసీపీ నేతలు అంటున్నారని, సబకు వస్తే కదా మైక్ ఇచ్చేది లేనిదీ తెలుస్తుంది అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వచ్చి గొంతుక వినిపించాలని ఈ సందర్భంగా జగన్ రెడ్డికి కూడా చెబుతున్నానని అన్నారు. "ఈ పెద్దిరెడ్డి రూ.2 లక్షల కోట్ల అక్రమ ఆస్తులను కూడబెట్టాడు. అన్నిటికన్నా సిగ్గు పడాల్సిన విషయం ఏంటంటే... ఓటర్లు ఓట్లు వేసి గెలిపిస్తే అసెంబ్లీకి వచ్చి నియోజకవర్గ ప్రజల తరఫున నీ గొంతు వినిపించడానికి ధైర్యం చాలని నీకు ఎమ్మెల్యే పదవి దండగ. నీకే కాదు... జగన్ తో కలిపి 11 మంది ఎమ్మెల్యేలు గెలిచి ఉపయోగం ఏముంది? ఎందుకు మీరు శాసనసభకు రాలేకపోతున్నారు?" అంటూ నాగబాబు నిలదీశారు. ఇక, వైసీపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడడం మానుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు చూడాలని హితవు పలికారు. "నోటికొచ్చినట్టు వాగే వైసీపీ సన్నాసులకు చెబుతున్నా... వృద్ధులు, వితంతువుల పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇస్తున్నాం. పెంచిన పెన్షన్లను ప్రతి నెల వాళ్ల ఇళ్ల వద్దేనే ఇస్తున్నాం. దివ్యాంగులకు రెట్టింపు పెన్షన్లు ఇస్తున్నాం. గత జగన్ ప్రభుత్వం వచ్చిన మొదటి నాలుగు నెలల్లో రూ.250 పెన్షన్ పెంచడం తప్ప వేరే ఏ హామీ అమలు మొదలుపెట్టలేదు" అని నాగబాబు విమర్శించారు. రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్లు తెచ్చుకున్నామని, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.12 వేల కోట్ల నిధులు సంపాదించుకున్నామని వివరించారు. దీపం పథకం ద్వారా 80 లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నామని నాగబాబు తెలిపారు. ముఖ్యంగా, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు పడిన రోడ్లకు రూ.361 కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నామని చెప్పారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేయిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్ లు ఏర్పాటు చేశామని వివరించారు. ముఖ్యంగా, మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు... మరోవైపు 6 వేల పోలీసు ఉద్యోగాల నియామకాలకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిందని... ఉచిత ఇసుక అందించడం ద్వారా పేదలపై ఆర్థికభారం తొలగించామని నాగబాబు వివరించారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే జీవో నెం.217, జీవో నెం.144 రద్దు చేశామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రాకతో దాదాపు 20 ప్రముఖ కంపెనీలు రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చాయని, తద్వారా 4 లక్షల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. విశాఖలో టీసీఎస్ డేటా సెంటర్ ద్వారా 10 వేల ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. గతంలో లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం జరిగిందని అన్నారు.

# బడ్జెట్‌లో కేంద్రం వివక్షపై యుద్ధం

**అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ప్రకటిస్తున్నాం .. కాంగ్రెస్ ధర్నాలో పార్టీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**

**8 మంది చొప్పున బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డే**

**బీజేపీ ఎంపీలకు తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఇప్పటికైనా గొంతెత్తాలి..**

**కిషన్‌రెడ్డి, సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ .. నేడు జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపు**



హైదరాబాద్: బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష వైఖరికి నిరసనగా అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా యుద్ధం ప్రకటిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని కాంక్షించే ప్రతి పౌరుడూ తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 'దేశమంటే మట్టి కాదోయ్..' అంటూ తెలుగు గేయాన్ని గుర్తుచేసి.. తెలుగు ప్రజల ఆకాంక్షలకు, తెలుగు నేల అభివృద్ధికి బడ్జెట్‌లో మొండిచేయి చూపారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పేర్కొంటూ.. ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్.. దేశ సమగ్రాభివృద్ధికి కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం బడ్జెట్ కేటాయింపులు చేసినట్లు ఉందని మహేశ్‌గౌడ్ ధ్వజమెత్తారు. తెలంగాణ విషయంలో బీజేపీ సవతి ప్రేమను అవి తెలియజేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రం నుంచి లక్షల కోట్ల రూపాయల పన్నులు తీసుకుంటున్న కేంద్రం, కనీసం రూ.40 వేల కోట్లు కూడా రాష్ట్రానికి కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి కేంద్రం గాడిద గుడ్డు ఇచ్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు తెలంగాణ అభివృద్ధి పట్టదా అని నిలదీశారు. రాష్ట్రంపై ప్రేమ ఉంటే వారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కక్షపూరిత వైఖరికి నిరసనగా రాజకీయాలకతీతంగా తెలంగాణ వాదులు ఏకతాటి పైకి రావాలని మహేశ్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.




## నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

వరంగల్%-%ఖమ్మం%-%నల్లగొండ ఉపాధ్యాయ, కరీంనగర్, మెదక్, నిజా మాబాద్, ఆదిలాబాద్ జిల్లాల, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ల ఎన్నికకు సోమవా రం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.11న నామినేషన్ల పరిశీలన, 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నల్లగొండ కలెక్టరేట్ బయట 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్లలోపు మూడు వాహనాలు, నామినేషన్ అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నా మినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవహరిస్తారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కలెక్టర్ పమేలా సత్పతి ఆర్వోగా వ్యవహరిస్తారు. నామినేషన్ల స్వీకరణకు కరీంనగర్ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**నామినేటెడ్ పదవులలో బీసీలకు తీవ్ర అన్యాయం**

**సింగిల్ విండో ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలి**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**





దేవరకొండ ఫిబ్రవరి 02 వార్త మిర్రర్ : బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేవరకొండ పట్టణంలో ఆదివారం నాడు బీసీ పొలిటికల్ జెఎసి యువజన విభాగం ఆధ్వర్యంలో క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి రాచాల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగణన చేపట్టిందని, దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటదని ఆశిస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో కూడా బీసీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఈ విషయంపై బీసీ ఎమ్మెల్యేలు కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. త్వరలో భర్తీ చేయనున్న ప్రభుత్వ పదవులలోనైనా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వాలు అధ్యక్షులకు మాత్రం కల్పించలేదని, దీంతో రాష్ట్రమంతటా ఒకే సామాజిక వర్గం వారు ఆధిపత్యం చెలాయిస్తూ ఎస్సీ,ఎస్టి, బీసీలను రాజకీయంగా అణచివేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో నైనా సింగిల్ విండో ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగడంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బీసీలను ఐక్యం చేసేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి మల్లేష్, నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కొండ సాయిరాం కురుమ, బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సత్యం, నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టపల్లి అనిల్, దేవరకొండ మండల అధ్యక్షులు పోతురాజు ధనరాజ్ యాదవ్, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కలగోని రమేష్, చింతపల్లి మండల అధ్యక్షులు గజ్జ నాగరాజ గౌడ్, చందంపేట మండల అధ్యక్షులు జిల్లా శివప్రసాద్, నేరేడుగొమ్ము అధ్యక్షుడు హరీష్ యాదవ్, శ్రీరాములు, సిద్దు, పచ్చిపాల మహేష్, ఆంజనేయులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి అవసరమైన చిత్రం ది అవార్డ్ 1996

**చేనేత కళాకారులపై చిత్రం అభినందనీయం**

**దర్శక నిర్మాతలు, నటీనటులకు అభినందనలు**

**ది అవార్డ్ ట్రైలర్ ను విడుదల చేసిన సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్ బాబు**





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఫిబ్రవరి 02 : హైదరాబాద్ దేశానికి రైతన్న ఎంత ముఖ్యమో.. దేహానికి నేతన్న అంతే ముఖ్యం. అలాంటి చేనేత రంగంలో ప్రతిభా వంతులైన కళాకారులు దళారుల చేతుల్లో ఎలా మోసపోతున్నారనే కథాంశంతో భూదాన్ పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం " ది అవార్డ్ 1996" . పలు యదార్థ సంఘటన ఆధారంగా మెగా మేజ్ ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై శ్రీకాంత్ సి సమర్పణలో చిరందాసు ధనుంజయ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో సురేష్ ప్రొడక్షన్స్ అధినేత శ్రీ సురేష్ బాబుగారి చేతుల ది అవార్డ్ ట్రైలర్ ను విడుదల చేశారు. ట్రైలర్ ఆద్యంతం వీక్షించిన సురేష్ బాబు గారు... దర్శక నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబుగారు మాట్లాడుతూ... ది అవార్డు 1996 ట్రైలర్ చాలా బాగుంది. మంచి హృదయంతో ఈ సినిమా తీశారు. చేనేత కళాకారులు, వారి సమస్యలను సమాజానికి చూపించాలనుకోవడం అభినందనీయం. సోషల్ రిలవెంట్ టాపిక్ ఇది, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది అన్నారు. అనంతరం చిత్ర యూనిట్ కు సంబంధించిన ఇతర వివరాలను సురేష్ బాబు గారు అడిగి తెలుసుకున్నారు. తమ మూవీ ట్రైలర్ ను సురేష్ బాబు విడుదల చేయడం పట్ల నిర్మాత ధనుంజయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో అనుభవం ఉన్న నిర్మాత సురేష్ బాబుకు ట్రైలర్ నచ్చడం, సినిమా గురించి అడిగి తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ట్రైలర్ కంటే సినిమాలో ప్రేక్షకులకు ఆకట్టుకునే ఎన్నో అంశాలున్నాయన్నారు. త్వరలోనే ది అవార్డ్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. ఈ చిత్రంలో శివరామ్ రెడ్డి, సాయి చందన జంటగా నటించగా బన్నీ అభిరన్ కీలక పాత్ర పోషించారు. ప్రశాంత్ మార్క్ సంగీతాన్ని అందించగా లింగా గౌడ్ సినిమాటో గ్రాఫర్ గా పనిచేశారు. రాజ్ చెన్నూరి, పవన్ ఎడిటింగ్ చేశారు.

# 1/2005 ఆక్ట్ రద్దు చేసి భాషోపాధ్యాయులకు నియామకం నోషనల్ సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలి

**ఆర్.యు.పి.పి.టి.**

**రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...**



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 2 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర శాఖ పక్షాన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గల రాష్ట్ర, జిల్లా ప్రధాన బాధ్యుల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు యం.డి అబ్దుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ పాల్గొని మాట్లాడుతూ 1/2005 ఆక్ట్ రద్దు చేసి భాషోపాధ్యాయులకు నియామకం తేది నుండి నోషనల్ గానైనా సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని, 24 సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెూదా కల్పించాలని, ప్రాథమిక పాఠశాల ల్లో హిందీని ప్రవేశపెట్టి తెలుగు హిందీ పండితులను నియమించాలని, మిగిలిన భాషాపండితులందరికి పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి క్రాంతి కృష్ణ, రాష్ట్ర కోశాధికారి నాగుల బిక్షపతి, జిల్లా అధ్యక్షులు కటుకం నరేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు అన్నారంబట్ల సూర్య నారాయణ, వంగపల్లి సంపత్ కుమార్, సట్టు కనకయ్య, నేరువట్ల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక విజయపురి కాలనీ మీసేవ భవనంలో ఏర్పాటుచేసిన ఉచిత ఫిజియో థెరపి సేవలకు మంచి స్పందన




సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 2 .... తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటీజన్స్ వింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిజియో థెరపి సెంటర్ సాజన్యంతో తార్నాక మీ సేవా బిల్డింగ్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ సెంటర్ ను గ్రేటర్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్ చొరవ తీసుకొని సేవలందించేందుకు ముందుకు వచ్చిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ . కృష్ణ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చొరవ నెలలో ప్రతి మొదటి ఆదివారం ఉదయం 10 నుండి మధ్యా హ్నం 1 గంటల వరకు ఉచిత ఆర్థోపెడిక్ సంప్రదింపులను చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డిప్యూటీ మేయర్ కు రోడ్లు, వీధిలైట్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న మీ సేవా ప్రాంగణంలో బస్తీ దవాఖాన, సీనియర్ సిటిజన్ సెంటర్లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆమె అసోసియేషన్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ సెంటర్ కమిటీ అధ్యక్షుడు వి. నాగేశ్వర్ రావు, వైస్ ప్రెసిడెంట్ కావూరి నరసింహారావు. కార్యదర్శి ఎన్.కె. జయ సుందర్, కార్యనిర్వాహక సభ్యులు వామన్ రావు, డాక్టర్ ఇందిర. అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.



## కుంభమేళాలో తప్పిపోయిన మహిళలు క్షేమంగా ఇంటికి ..

వార్తమిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 2 : జగిత్యాల పట్టణంలోని విద్యా నగర్ కు చెందిన 55 ఏళ్ల నర్సవ్వ, కొత్త వాడకు చెందిన రాజవ్వ ఈ నెల 29న ప్రయగ్ రాజ్ లోని కుంభమేళా కు తమ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళారు. కుంభ మేళాలో లో కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే వీరిద్దరూ శనివారం జగిత్యాలకు చేరుకోవడంతో... కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



## మృతుడు కుటుంబానికి ఉప్పల ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి పట్టణంలోని 7వ వార్డు పురాణ మజీద్ కాలనీ కి చెందిన నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన షేక్ ఫరీద్ అనారోగ్యంతో మరణించడం జరిగింది. మృతుడు షేక్ ఫరీద్ గురించి దారమోని గణేష్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో ఫరీద్ కుటుంబానికి రూ "3000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాచోటి శ్రీశైలం, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, బిఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కనుక సత్యనారాయణ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భగత్ సింగ్,బిఆర్ఎస్ పార్టీ 7వ వార్డు అధ్యక్షుడు మూర్తి ,మాజీ ఉప సర్పంచ్ శ్రీను నాయక్ , తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు షకీల్, హనుమంతు నాయక్, సాదిక్ , జాహెద్ ,షేక్ బాబా,తదితరులు పాల్గొన్నారు.



## కన్నులపండువగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 2 : లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో శాంతినగర్ లో తక్షశిల స్కూల్లో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవ వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులతో పాటు స్థానిక ప్రజలు కుటుంబ సభ్యులతో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో లాలాపేట్ ఆర్యవైశ్య శాశ్వత గౌరవ అధ్యక్షులు నేతిరాములు గుప్త, అద్యక్షులు మడిపడిగ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలందరు సుభిక్షంగా ఉండాలనే మంచి ఉద్దేశ్యంతో శ్రీనివాసుడి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోషాదికారి యెనిశెట్టి భాస్కర్, మహిళా విభాగం అధ్యక్షురాలు యెనిశెట్టి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి ఉప్పల లక్ష్మి, కోషాధికారిని తొడువు సూరి స్వాతి, ఫణిరాజ్, ఎనిశెట్టి కృష్ణయ్య, కాపర్తి ఇంద్రయ్య, ఎం. రవి ప్రకాష్, శ్రీకాంత్, ఈ.వెంకటేష్, పి. రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ బహుమతి 12 లక్షల ఆదాయం పై పన్ను రద్దు చేసిన మోదీ సర్కార్

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి**



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 2 : ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రూపొందించిన బడ్జెట్ 2025 – 26 లో ?12 లక్షల రూపాయల వార్షిక ఆదాయం పై పన్ను రద్దు చేస్తూ బడ్జెట్ సెషన్ లో ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్. సూక్ష్మ – మధ్యతరహా పరిశ్రమలకు 10 లక్షల వరకు క్రెడిట్ సౌలభ్యం, స్టార్ట్ – అప్ లకు ప్రోత్సాహం 5 లక్షల మంది ఎస్సి – ఎస్టీ మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా గుర్తించి వారికి 2 కోట్ల వరకు రుణాలు అందించే వెసులుబాటు కల్పిస్తున్నారు, కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా అందజేసే రుణాల పరిమితిని కూడా పెంపునకు బడ్జెట్ లో ప్రతి పనులు చేశారు. ఈ రుణాలను రూ.3 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు పెంచుతున్నట్లు తెలిపారు, బడ్జెట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల డ్వాక్రా సంఘాల మహిళలకు గ్రామీణ క్రెడిట్ కార్డులను కూడా ఈ బడ్జెట్లో ప్రతిపాదించారు, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను వినియోగించనున్నట్టు తెలిపారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

## కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 2 : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని సాడే భీమ్ క్రీడా మైదానంలో రాయికల్ క్రికెట్ లీగ్ సీజన్ 3 ముగింపు కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఫైనల్ మ్యాచ్ ఎద్దండి దివాకర్,కాటిపల్లి రాంరెడ్డి మధ్య ఉత్కంఠంగా జరిగిన పోటీలో కాటిపేల్లి రాంరెడ్డి టీం ఘనవిజయం సాధించింది. ఆర్పిఎల్ ఫ్రాంచెస్, ప్రెస్ క్లబ్ స్నేహపూర్వక మ్యాచ్లో ప్రెస్ క్లబ్ టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ యువతను చెడు అలవాట్లకు పోకుండా క్రీడలు పై ఆసక్తి పెంచేందుకు క్రీడా పోటీలను నిర్వహించిన ఫ్రాంచెస్ నిర్వాహకులను అభినందించారు. ఆర్ పి ఎల్ నిర్వాకులు మ్యాకల రమేష్, ఎద్దండి దివాకర్, కొయ్యేడి మహిపాల్ రెడ్డి, ఎలిగేటి అనిల్, కాటిపెల్లి రామ్ రెడ్డి, కల్లెడ ధర్మపురి, బత్తిని నాగరాజు, మోర రామ్మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు బత్తిని భూమయ్య, పాత్రికేయుల ఫ్రాంచెస్ ఇందూరి గంగాధర్, పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్, సింగిడి శంకరయ్య, బొంగోని శ్రీనివాస్, మచ్చ శేఖర్, రమణ, ముజాఫర్, గుర్రాల వేణు, వాసవి రవి, జగన్, ఎనుగంటి రవి, శ్యామ్, రషీద్, షాకీర్, తిరుమల శంకర్, శ్రీనివాస్, జితేందర్, కృష్ణ, రాజు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# బస్టాండ్ నిర్వాహకుల నిర్లక్ష్యం

## నీటి శుద్ధి కేంద్రం వద్ద అపరిశుభ్రత

## ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి



కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి బస్టాండ్ ను ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు సందర్శించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ – సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బస్టాండ్ అవరణలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి,నిర్వహణ లోపం,అపరిశుభ్రంగా ఉండడం గమనించి సరైన నిర్వహణతో పాటు పరిశుభ్రంగా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించవల్సింగా నిర్వహణ సిబ్బందికి సూచించడం జరిగింది. అలాగే బస్టాండ్ అవణరణలో ప్రయాణికులు తెలియజేసిన సమస్యలను,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేల ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# యంగంపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనృసింహాస్వామి దేవాలయ ధ్వజ ప్రతిష్ట మహోత్సవం

### పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
### మాజీ ఎమ్మెల్యే జి. జైపాల్ యాదవ్





కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:–శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోహారే సహస్ర నామతతుల్యం రామనామ వరాననే...అంటూ యంగంపల్లిలో గత మూడు రోజులుగా శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయస్వామి నవగ్రహా కీర్తి,లక్ష్మి నృసింహస్వామి దేవాలయ ధ్వజ ప్రతిష్ట మహోత్సవం గత మూడు రోజులుగా కన్నుల పండుగ జరిగింది.పచ్చని పందిర్లు,శోభాయమానమైన విద్యు త్ దీపాలతో దేదివ్యమానంగా సీరామాంజనేయ స్వామి దేవాలయం,లక్ష్మి నరసింహాస్వాదేవాలయం విరాజిల్లుతోంది. సీతారామాచంద్రస్వామి నామ:స్మరణతో యంగంపల్లి పురవీధులు మారుమోగిపోతున్నాయి.గత గురువారం 30వ తేదీ స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, స్వస్తీవాచనము,అఖండ దీపారాధన తో పాటు క్షేత్ర పాలక,నవగ్రహా సర్వతోభద్ర మండవ ఆవాహనం తదితర పూజ కార్యక్రమాలతో పాటు 31వ తేదీ శుక్రవారం యాగశాల ప్రదక్షణలు,ప్రాతః కాల మండవ పూజలు,ప్రతిష్ట విగ్రహాములకు గోక్షరాధివానము,దేవతల హెరీమము,నివేదన నీరాజనం తీర్థ ప్రసాద వియోగం కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి.జనవరి 1వ తేదీ స్వామి వారికి ఉదయం 5 గంటలకు ప్రాతకాల మండవ పూజలు, శతబిషా నక్షత్రయుక్త ధమర్ లగ్నములో యంత్ర విఘ్రుహా ప్రతిష్టాపనము,బలిహారము, కుంభ నివేధన,పూర్ణాహుతి కరితోధ్వానము తో పాటు ఉదయం 8 గంటలకు శ్రీ సీతారామాంజనేయ స్వామి, లక్ష్మి నరసింహాస్వామి ల ఆలయాల ముందు ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం శోభయమానంగా జరిగాయి. సాయంత్రం 3 గంటలకు విశ్వ గురువు అవధూత చక్రవర్తి భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూతస్వామి ఆధ్వర్యంలో శ్రీ వేణుదత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతము,కంకణ ధారణ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి.ఈ పూజత్సోవాల్లో యంగంపల్లి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులైయ్యారు. స్వామి వారి దర్శణనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ లంకాల శ్రీనివాసడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు భక్తులకు



ఎలాంటి అసౌకర్యం కలుగకుండ అన్ని ఏర్పాట్లను చేపట్టారు.గత మూడు రోజులుగా ఆలయంలో అన్నదాన కార్య కమం నిర్వహించారు.

### స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం యంగంపల్లిలోని శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి, నరసింహస్వామి ధ్వజస్థంబ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి కొబ్బరికాయ సమర్పించిన అ నంతరం మొక్కులు సమర్పించారు. అంతకు ముందు ఆలయం వద్దకు ఆయన డప్పు కొమ్ములు,పూర్ణా కుంభంతో అర్చకులతో పాటు ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ లంకాల శ్రీనివాసి ఆలయ ఫౌండర్ ట్రస్టీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జి. జైపాల్ యాదవ్

యంగంపల్లిలోని శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి, నరసింహాస్వామి ధ్వంజస్థంబ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.జైపాల్ యాదవ్ పాల్గొన్నారు.ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేకు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. అనంతర0 పలు ఆలయాలలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి మొక్కులు సమర్పించారు. అనంతరం లంకాల రామేశ్వరమ్మ శ్రీనివాస్ రెడ్డి మొండిపట్టుదల, పాలకమండలి సభ్యుల సహాకారం,గ్రామస్తుల సహాకార 0తో ఈ రెండు ఆలయాలలో ఎంతో ఆహ్లాదకరంగా ఈ పూజ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ పూజ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి గోవర్ధన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోవర్ధన్, మాజీ సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎముక జంగయ్య,మాజీ సర్పంచ్ స్వేత యాదగిరి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పి.పాండుగౌడ్,రవి తదితరులు ఉన్నారు.

### యంగంపల్లి గ్రామంలో పండుగ వాతావరణం

గ్రామంలోని రెండు దేవాలయాల ముందు ఒకే సారి ధ్వజస్తంబ ప్రతిష్ట,నవ గ్రహా ప్రతిష్టతో పాటు ఆలయాల స్వామీ వార్ల ప్రతిష్ట పెద్ద ఎత్తున జరుగుతుండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఆడపడుచులు, పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. డప్పుచప్పులు,మైక్ల మోతతో గ్రామ పురవీధులు మారు మోగిపోయాయి.లంకాల రామేశ్వరమ్మ శ్రీనివాస్ రెడ్డి చొరవతో ఆలయ కమిటీ సభ్యుల సహాకారం,గ్రామస్తుల సూచన మేరకు ఈ ఆలయాలలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం, పలుపూజోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయాల వద్ద జాతర వాతావరణం నెలకొనింది. ఏది ఏమైన ఎన్నో రోజుల కల సకారమైందని యంగంపల్లి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు.



## వారసంతలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం ఎస్సై సుధీర్‌రావు

### ::: ప్రశంసించిన ప్రజలు

వార్త మిర్రర్ రాయికల్ (శంకర్ తిరుమల) ఫిబ్రవరి 2 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని వారసంతలో గత కొన్నేళ్లుగా ఉన్నటువంటి ట్రాఫిక్ సమస్య, రాయికల్ పట్టణ ఎస్సై సుధీర్ రావు చొరవతో పరిష్కారం అయ్యింది. భారీ వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలు వార సంతగుండా వెళ్లకుండా, భారీకేడ్లను ఏర్పాటు చేశారు. అలాగే వార సంతలో తోపుడు బండ్లు నడిరోడ్డు మీదికి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలగకుండా, మరియు నడిరోడ్డు మీద తోపుడుబండ్లను పెట్టే వారి వివరాలను కానిస్టేబుళ్లు సేకరించి, వారసంతకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలిగించద్దని వారికి తెలిపారు. నడిరోడ్డు మీద తోపుడు బండ్లను పెట్టినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన రాయికల్ ఎస్సైని మరియు కానిస్టేబుళ్లను ప్రజలు ప్రశంసించారు.




## ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో విజేత రాయికల్ ప్రెస్ క్లబ్

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 2 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలోని సాడే భీమ్ క్రీడా మైదానంలో రాయికల్ ఫ్రాంచెస్ కు రాయికల్ ప్రెస్ క్లబ్ కు మధ్య జరిగిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రెస్ క్లబ్ 10 ఓవర్లలో 81 పరుగులు సాధించగా, రాయికల్ ఫ్రాంచెస్ 67 పరుగులు సాధించారు. 14 పరుగుల తేడాతో రాయికల్ ప్రెస్ క్లబ్ టీం క్రికెట్ విజేతగా నిలిచారు. వీరికి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ట్రోఫీ తో పాటు, మెమొంటోను అందజేశారు. అనంతరం నూతన ప్రెస్ జేఏసీ కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి, చింతకుంట సాయికుమార్, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, సీనియర్ పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్, సింగిడి శంకరయ్య, తిరుమల శంకర్, వెంకటరమణ, ఎనుగంటి రవి, గుర్రాల వేణు, కళ్లెం శ్రీనివాస్, శ్యామ్ సుందర్, బొంగోని శ్రీనివాస్, ముజాఫర్, తీగుల్ల గోపి, రషీద్, సుధాకర్, జితేందర్, కృష్ణారెడ్డి, షాకీర్, రాజేష్ పాత్రికేయులు పాల్గొన్నారు.



## శక్తి నగర్‌లో ట్రాన్స్ఫార్మర్‌ని ప్రారంభించిన కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్, 2 ఫిబ్రవరి : వనస్థలిపురం డివిజన్ శక్తి నగర్ కాలనీ అభివృద్ధి కోసం తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శక్తి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 13 లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి తన పదవి కాలం పూర్తి అయ్యే లోపు డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శక్తి నగర్ వెల్పర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బన గోని అజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎండి ఖాదర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కె .కిష్టయ్య, బుసిరెడ్డి వెంకటరెడ్డి, మహాలింగం, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, పొడిసెట్టి సత్యనారాయణ, మహేందర్ రెడ్డి,సుభాష్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డి

### ఆర్ట్స్ కాలేజీ యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న

హనుమకొండ చౌరస్తా: తెలంగాణలో చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 2028లో బీసీ వ్యక్తి సీఎం కావడం పక్కా.. అని తీన్మార్ మల్లన్న అన్నారు. హనుమ కొండలోని యూని వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం బీసీ రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి మల్లన్న ప్రసంగించారు. కుల గణనలో రెడ్లు, వెలమల శాతం ఎంతో చెప్పే ధైర్యం ప్రభుత్వాలకు లేదని అన్నారు. 55 శాతం ఉన్న బీసీలు ఏడాదికి లక్షా 20 వేల కోట్ల పన్నులు చెల్లిస్తుంటే.. ఆ కుప్పపై రెడ్లు, వెలమలు కూర్చుని కాంట్రాక్ట్‌లు చేసుకుంటూ సొంత ఖజానా నింపుకుంటున్నారని విమర్శించారు. ఈ సభ రెడ్లు, వెలమలకు%–%బీసీలకు మధ్య జరిగిన విడాకుల సభ అని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీసీలు ఎవరైనా బీసీ అభ్యర్థులకే ఓటేయాలని మల్లన్న కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీపీమండల్ మనవడు సూరజ్ మండల్ పాల్గొన్నారు.

# పయనీరింగ్ ఎక్సలెన్స్‌తో వజ్రా ఈవెంట్స్ 13వ వార్షికోత్సవం



హైదరాబాద్ వార్త మిరప ప్రతినిధి : దక్షిణ భారతదేశంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ , హాస్పిటాలిటీ ల్యాండ్‌స్కేప్‌ను పునర్నిర్వచించే "ఆవిష్కరణ, నాణ్యత, శ్రేష్ఠతకు నిబద్ధత" అనే నినాదంతో వజ్రా ఈవెంట్స్ 13వ వార్షికోత్సవాన్ని బంజారాహిల్స్ లో ఘనంగా నిర్వహించారు. 2012లో అరుణ్ కుమార్ తడ్కా స్థాపించారు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో త్వరగా ప్రాముఖ్యతను సంతరించుకున్నారు. ప్రారంభంలో సామాజిక కార్యక్రమాలతో ప్రారంభించి, దక్షిణ భారతదేశంలో వజ్రా ఈవెంట్స్‌ను ప్రముఖ పేరుగా విస్తరించారు. పెద్ద ఎత్తున వివాహాలలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. అన్నింటినీ కలిగి ఉన్న ఈవెంట్ మేనేజ్‌మెంట్ పవర్‌హౌస్‌గా అభివృద్ధి చెందుతున్నారు. నేడు, వజ్రా ఈవెంట్స్ నాలుగు విభిన్న వరుసలతో అభివృద్ధి చెందుతోంది. ఇది చిరస్మరణీయమైన జాగ్రత్తగా అమలు చేయబడిన అనుభవాలను కోరుకునే క్లయింట్‌లకు ఇది ఒక గమ్యస్థానంగా మారిందని అన్నారు. వజ్రా ఈవెంట్స్ వివాహ పరిశ్రమను పునర్నిర్వచించి, ప్రతి వేడుకను ఒక అద్భుత కథగా మార్చింది. గ్రాండ్ వెడ్డింగ్స్‌లో ప్రత్యేకత కలిగిన ఈ బృందం, నిశ్చితార్థం పార్టీల నుండి రిసెప్షన్ వరకు ప్రతి అంశాన్ని దోషరహితంగా అమలు చేస్తుందని నిర్ధారిస్తుంది. వారు అతిథి నిర్వహణ, ఆతిథ్యం, ??అలంకరణ, విక్రేత సమన్వయం మరియు వినోదంతో సహా ఈవెంట్ యొక్క అన్ని కోణాలను నైపుణ్యంగా నిర్వహిస్తారు. కార్పొరేట్ క్లయింట్‌ల కోసం, వజ్రా ఈవెంట్స్ ఈవెంట్ ప్లానింగ్‌కు డైనమిక్ విధానాన్ని అందిస్తుంది, ప్రతి ఈవెంట్ బ్రాండ్ యొక్క సారాంశం మరియు లక్ష్యాల ప్రతిబింబం అని నిర్ధారిస్తుంది. ఉత్పత్తి ప్రారంభాలు, స్టోర్ ఓపెనింగ్‌లు లేదా హై-ప్రొఫైల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లను నిర్వహించినా, వజ్ర ఈవెంట్స్ దృష్టిని ఆకర్షించే మరియు శాశ్వత ముద్ర వేసే ఈవెంట్‌లను అందించడంలో అద్భుతంగా ఉంటుంది. వినోద కార్యక్రమాల ప్రపంచంలో వజ్ర ఈవెంట్స్ ఒక శక్తి. ఆడియో లాంచ్‌లు, సినిమా ప్రమోషన్‌లు మరియు సెలబ్రిటీ నిర్వహణను నిర్వహించడంలో నైపుణ్యంతో, వజ్ర ఈవెంట్స్ బాహుబలి 2, సర్దార్ గబ్బర్ సింగ్ మరియు రుద్రమదేవి వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో కలిసి పనిచేసింది, ఇటీవల, వజ్రా ఈవెంట్స్ గర్వంగా ఎక్స్‌పీరియం గ్రాండ్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించింది, దీనికి విశిష్ట ముఖ్య అతిథులు, సీఎం రేవంత్ రెడ్డి , మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఈ విజయవంతమైన కార్యక్రమం ప్రభావవంతమైన ఎమ్ ఐ సి ఈ ఈవెంట్‌లను నిర్వహించడంలో అగ్రగామిగా వజ్రా ఈవెంట్స్ స్థానాన్ని మరింత పటిష్టం చేసింది. వజ్రా ఈవెంట్స్‌ను ప్రత్యేకంగా నిలిపేది ఆవిష్కరణ, నాణ్యత మరియు మార్కెట్ డిమాండ్‌లకు అనుగుణంగా ఉండే సామర్థ్యం కోసం దాని నిరంతర కృషి. కంపెనీ యొక్క అద్భుతమైన వృద్ధికి దాని అత్యంత నైపుణ్యం కలిగిన బృందం మరియు సంపూర్ణంగా అమలు చేయబడిన ఈవెంట్‌లను అందించడంలో దాని అవిశ్రాంత నిబద్ధత కారణమని ఈవెంట్ నిర్వాహకులు తెలిపారు.

## టి పి టి ఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పన్నాల గోపాల్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి



మిర్యాలగూడ ,ఫిబ్రవరి 2 :-( వార్త మిర్రర్) నాణ్యమైన ఉచిత విద్య అందించుటకు ప్రభుత్వ పాఠశాలల ను దశలవారీగా సెమి రెసిడెన్షియల్ స్కూల్ గా మార్చి ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేయాలని ప్రధాన ఉద్దేశంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పాల్గొంటున్నాం. ఒకటే పడి ఉండాలి. కనగల్ మండలము ధర్వేశిపురం లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ,317 జీవో వలన ఉపాధ్యాయ, ఉద్యోగులను స్థానిక జిల్లాల నుండి స్థానికేతర ప్రాంతాలకు బదిలీ చేసినప్పటికీ ఎవరు పట్టించుకోలేదు దీని మూలంగా దాదాపు 20 మంది ఉపాధ్యాయులు హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయిన విషయం తెలిసినదే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు గానీ, ఉపాధ్యాయ సంఘాలు గాని ఉపాధ్యాయ విద్యా సంక్షేమానికి పాటు పడక పోవడం మూలంగా విద్యార్థి దశ నుండి ఉద్యమాలలో పాల్గొన్నాను ఉపాధ్యాయుడిగా ఏపీటీఎఫ్, టి పి టి ఎఫ్ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర కార్యదర్శిగా కూడా పని చేసినాను పదవి విరమణ పొందినప్పటికీ ఉపాధ్యాయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటున్నాను అందుకే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేయాలని అధ్యాపక, ఉపాధ్యాయ, తెలంగాణ ఉద్యమకారుల మద్దతో పోటీ చేస్తున్నాను . ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్ మంజూరు చేస్తున్నప్పటికీ 30 సంవత్సరాలకు పైగా ప్రజలకు సేవ చేస్తున్న ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వకపోవడం చాలా విచారకరం సి పి ఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ కొనసాగించాలి. మధ్యాహ్న భోజనం వలన ప్రధానోపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారు వారికి అకాడమిక్ పని మాత్రమే ఉండాలి, మధ్యాహ్నం భోజనానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు ఒకటో తేదీ కాకుండా 17 - 20 తేదీలలో వేతనాలు చెల్లిస్తున్నారు . జీరో వన్ జీరో పద్దు పై మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని , మోడల్ స్కూళ్లలో, గురుకుల పాఠశాలలో వంట పని వలన బోధనకు ఉపాధ్యాయులు దూరమవుతున్నారు అందుకే వెంటనే వార్డెన్ పోస్టును మంజూరు చేయాలి ,పని చేసే సిబ్బంది అందరికీ హెల్త్ కార్డు మంజూరు కి కృషి చేస్తాను, ఎయిడెడ్, గురుకుల, కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయి లందరికీ జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు జరగాలి సమగ్ర శిక్ష ఉద్యోగు లందరినీ రెగ్యులర్ చేయాలి ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. విద్యావ్యవస్థను పూర్తిగా ఒకే బోర్డు క్రిందికి తీసుకురావాలి. గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలని , ఈ - కుబేర్ వ్యవస్థను రద్దు చేస్తూ ట్రెజరీ డిపార్ట్మెంట్ ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని పునరుద్ధరించి, ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారము నకు కృషి చేస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ధీరావత్ వీర నాయక్ మాట్లాడుతూ ఆచార్య, అధ్యాపక, ప్రోగ్రెస్ యు, డెమొక్రటిక్ ఉపాధ్యాయులు, తెలంగాణ ఉద్యమకారులు బలపరిచిన ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు పన్నాల గోపాల్ రెడ్డి సార్ ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సార్ గారికి సమాచారం జేఏసీ నాయకులు , సాగర్, జగన్నాథం, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

### సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పేపర్లు దగ్ధం




మిర్యాలగూడ, ఫిబ్రవరి 2:- (వార్తమిర్రర్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ ఆరోపించారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. రాష్ట్రం నుండి ఎనిమిది మంది ఎంపీలు ఉన్న తెలంగాణకు బడ్జెట్లో తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి తడుపు చర్యగా ఉద్యోగులకు ఆదాయపు పన్నులో కొంత వెసులుబాటు ఇచ్చి కార్పొరేట్లకు రాయితీలు సబ్సిడీలు కల్పించారని విమర్శించారు. పెరిగిన నిత్యవసర ధరల విషయం ప్రస్తావన చేయలేదని పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించకుండా ప్రజలకు మరోసారి మోసం చేశారని ధ్వజమెత్తారు. రైల్వే లైన్ల విషయంలో కూడా ఉమ్మడి నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మూసి ప్రక్షాళనను కనీసం నిధులు కేటాయించకపోవడం సరైనది కాదన్నారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్కడి రాష్ట్రాన్ని మాత్రమే వరాలు ఇవ్వడం మోడీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజలు మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అర్థం చేసుకొని ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు సరైన నిధులు తీసుకొచ్చేందుకు రాష్ట్రంలోని ఎనిమిది మంది ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ జిల్లా నాయకులు నుకల జగదీష్ చంద్ర రవి నాయక్, రేమిడల పరశురాములు, వినోద్ నాయక్, నాయకులు కోటిరెడ్డి కోడి రేక్క మల్లయ్య, రామ్ రెడ్డి కరిమున్నిసా బేగం, బంటు రామారావు, మట్టరెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చోడు కాదు! స్వచ్ఛభారత్‌ని ఆదర్శంగా తీసుకున్న పిచ్చయ్య!



**హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : హయత్ నగర్ శ్రీనివాస కాలనీ లో నివాసం ఉండే కేంద్ర ప్రభుత్వ (బిఎస్ఎన్ఎల్) విశ్రాంత ఉద్యోగి, పిచ్చయ్య ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని రాజ్ ఘట్ లో స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని ప్రారంభిస్తూ 2019 సంవత్సరంలో జరగనున్న మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా మూల మూలలకు విస్తరించేలా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఒక జాతీయ ఉద్యమ రూపంలో మొదలుపెట్టారు, పరిశుద్ధమైన, ఆరోగ్యవంతమైన భారత్ ను ఆవిష్కరించాలన్న మహాత్ముని కలను నిజం చేసి చూపించాలని ప్రధాని ఈ సందర్భంగా దేశ ప్రజలకు పిలుపునిచ్చారు, ఆ ప్రధాని పిలుపును ఆచరిస్తూ నాటి నుంచి, విశ్రాంత ఉద్యోగి పిచ్చయ్య శ్రీనివాస కాలనీలో ఎక్కడ చెత్త కనపడ**



**తీసి వేస్తుంటాడు, ఉదయం వాకింగ్ లో గ్రౌండ్ లో పడేసిన చెత్తను బాటిల్స్ ను తీసివేసిన తర్వాతనే వాకింగ్ చేస్తాడు పిచ్చయ్య, కాలనీలో రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని, వీధిలో పడవేయొద్దని జాగ్రత్త పడడమే కాకుండా ఎవరు పడేసిన తీసి పక్కకు వేయడం అతని నిత్య దినచర్య,**



## సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడానికి ఫోనిక్స్ ఛాంబర్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం: వనస్థలిపురం ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు

ఎల్బీనగర్, 2 ఫిబ్రవరి : వనస్థలిపురంలో వాసవి టెంపుల్ లోని ఫంక్షన్ హాల్ లో ఎంతో మందికి జేసీఐ జూనియర్ ఛాంబర్స్ ఇంటర్నేషనల్ వారు హైదరాబాద్ ఫోనిక్స్ అనే చాప్టర్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనస్థలిపురం ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సైబర్ క్రైమ్ మీద అవేర్నెస్ అలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఎందు కంటే ప్రస్తుతం ప్రపంచంలో అతి పెద్ద సమస్య సైబర్ నేరాలు అని, ఎటు వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. నేరం జరిగిన తర్వాత వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి కాల్ చేసి వివరాలు తెలుపాలని చెప్పారు. జేసీఐ స్టూడెంట్స్ కి సంబంధించి ఎన్నో రకాల ఫ్రీ ట్రైనింగ్స్ అరనైజింగ్ చేస్తున్నారని, ఇందులో సెల్ఫ్ డెవలప్మెంట్ కమ్యూనికేషన్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్ మేనేజ్మెంట్ స్కిల్స్ బిజినెస్కిల్స్ లాంటి అనేక రకాల ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ని జేసీఐ ఆర్గనైజ్ చేస్తున్నారని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఏడుకొండలు, జెసిఐ ప్రెసిడెంట్ సువిధ, నీరజ్, యువ కాలేజ్ రెస్పాండెంట్ భాస్కర్, నందకిషోర్, భావన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఫ్రీ ట్రైన్ కి సంబంధించి ప్రోగ్రాం పాల్గొనాల్సిన విద్యార్థినీ విద్యార్థులు పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ ని 8686458899 సంప్రదించాలని కోరారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడి కి తీవ్ర గాయాలు మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలింపు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామవాసి పులిపలుపుల(బోస్) వెంకటేష్ గౌడ్,తండ్రి-మల్లయ్య, కల్లుగీత కార్మికుడు వృత్తిలో భాగంగా సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుండి పడి తీవ్ర గాయాలకుగురయ్యడు. కుటుంబ సభ్యులు స్థానిక హస్పటల్ కు తరలించగా తలకు తీవ్రమైన గాయాలు కావడం వలన మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. గాయపడిన కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్రేషియా మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరఫున ఎక్సైజ్ అధికారులను కోరుతున్నాం అన్నారు



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లకై బీసీల హక్కులకై అందరం కలిసి పోరాడుదాం

### బీసీ యువజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులకు -గడ్డం నరసింహ

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : హన్మకొండ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న బి సి రాజకీయ యుద్ధభేరి కీ తరలివెళ్లిన ఈ సందర్భంగా బి సి యువజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు గడ్డం నరసింహ మాట్లాడుతూ గత నెల రోజులుగా బి సి ల రాజకీయ యుద్ధభేరి కోసం పాదయాత్ర చేస్తూ చైతన్యం చేస్తున్న తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కోసం మన హక్కుల కోసం ఈ రోజు లక్షల మంది ఈ వేదిక దగ్గరికి చేరుకోవడం జరిగింది, అలాగే రేపు ముందు ముందు జరగబోయే స్థానిక ఎన్నికలలో మనకు రావాల్సిన మరియు ఎన్నికల ముందు మనకు ఇస్తానని చెప్పిన 42 శాతం రెసర్వేషన్ ల కోసం మనం అందరం పొడదాం మన బి సి ల హక్కులకై అందరం కలిసిపోరాడుదాం రండి. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, మండల నాయకులు బయ్యని రాజు, కలిమేల నర్సయ్య, చింత గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ఖజానాకు చేరిన గత బడ్జెట్ కేటాయింపులు

భారత ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌ను కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కొన్ని శాఖలు పూర్తిస్థాయిలో అప్పటి బడ్జెట్ నిధులను ఉపయోగించలేదు. మూలధన పెట్టుబడులు, వస్తువుల కొనుగోళ్లలో జాప్యం కారణంగా కొంతమేర నిధులు బూ తిరిగి ఖజానాకు చేరాయి. ఏయే విభాగాలు ఎంతమేరకు ఇలా నిధులు తిరిగి పంపాయో.. అందుకుగల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. కొన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు తమకు కేటాయించిన బడ్జెట్‌ను 2024-25 ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో వినియోగించుకోలేదు. కొనుగోలు ప్రక్రియల్లో జాప్యం, ఇతర బ్యూరోక్రాటిక్ అడ్డంకుల కారణంగా రక్షణ మంత్రిత్వ శాఖ రూ.12,500 కోట్లు తిరిగి కేంద్ర ఖజానాకు జమ చేసింది. ప్రభుత్వం కఠినమైన ఆర్థిక విధానాలు, మెరుగైన ఆర్థిక నిర్వహణ పద్ధతుల ద్వారా భారీగా ఖర్చు చేయడాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఖర్చులను ఆదాయ ఉత్పత్తికి అనుగుణంగా ఉండేలా చూసుకుంటున్నాయి. ఇది ఆర్థిక జాప్యాన్ని నివారించడానికి, సమతుల్య బడ్జెట్‌ను నిర్వహించడానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మెరుగైన పన్ను వసూలు యంత్రాంగాలు, పన్ను ఎగవేతను అరికట్టడంతో సహా సమర్థమైన ఆదాయ సమీకరణ ప్రయత్నాల వల్ల కొంత బడ్జెట్‌ను మిగిల్చింది. కొన్ని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, విదేశీ ప్రభుత్వాల మద్దతు వల్ల ద్రవ్యలోటును నిర్వహించడానికి, బడ్జెట్ అమలు సజావుగా జరిగేలా చూడటానికి సాయపడిందని నిపుణులు తెలియజేస్తున్నారు. నిధుల రాబడి, ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ పట్ల ప్రభుత్వం నిబద్ధతతో ఉందని చెబుతున్నారు.